




రామచంద్ర యాదవ్‌కు అభినందనలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు బోడె రామచంద్ర యాదవును కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు బిసి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు విజయవాడ నుంచి కడప జిల్లా పులివెందుల వెళ్తున్న రామచంద్ర యాదవును వలేటివారిపాలెంలో బిసి నాయకులు కలిసి సత్కరించారు. బిసి అభివృద్ధి కోసం పార్టీ స్థాపించినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బిసి నాయకులు కుంభాల అంజయ్య పొట్టేల అంజయ్య పొట్టేళ్ల క్రిష్టయ్య కూచిపూడి రాజశేఖర్ నలగట్ల బ్రహ్మయ్య బక్క మంత్రుల మురళి పిన్నికి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు



రామచంద్ర యాదవ్‌ను కలసిన బిసి సంఘం నాయకులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజారోగ్య పరిరక్షణ కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న తమను తక్షణమే పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు కార్పోరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రతి రోజులాగానే సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు తమ విధులు నిర్వహించి అనంతరం కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకొకుని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది తమ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మున్సిపల్ కార్మికులను ఫర్మినెంట్ చేస్తామని ఆర్భాటంగా హామీలు గుప్పించారన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం అందజేస్తామని, అసెంబ్లీ సాక్షిగా వాగ్దానం చేశారన్నారు. అయితే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఆ వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. మున్సిపల్ కార్మికుల గా పనిచేస్తున్న వారిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, ఇతర బలహీన వర్గాలు లకు చెందిన వారేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికైనా తమను పర్మినెంట్ చేయకపోతుందా అన్న ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. గత కొన్ని ఏళ్లుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్ధానాన్ని అమలు చేయడాన్ని మాత్రం విస్మరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్కాస్ వంటి బానిస వ్యవస్థను తీసుకొని వచ్చి 60 ఏళ్లు నిండిన కార్మికులను ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా అర్ధాంతరంగా ఇళ్లకు పంపిస్తున్నారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులను ఆప్కాస్ విధానంలో పనిచేయించుకుంటు, తక్కువ వేతనాలు అందజేస్తూ మరో ప్రక్క ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కార్మికులకు అర్ధాంతరంగా నిలిపివేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసే దానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే డిసెంబర్ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లేందుకు సిద్ధపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండ ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, సునీల్, సుజాతమ్మ, దేశ మూర్తి, చెన్నయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



హక్కులపై అవగాహన


నెల్లూరు : పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడానికి, పరస్పర అవగాహన పెంచు కోవడాన్ని ప్రోత్సాహిం చేందుకు గానూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ బాలల హక్కుల దినోత్సవాన్ని రూపకల్పన చేసిందని పాఠశాల ప్రధాం పాధ్యాయుడు ఎం భాస్కర్ రావు అన్నారు. కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు హరీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక పొదలకూరు రోడ్డు సమీపంలోని జెడ్‌పి హైస్కూల్‌లో ఐసిపిఎస్ ఆధ్వర్యంలో బెటి బచావో..బెటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి కె.వాణి ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. డిప్యూటి డిఇఒ ప్రసన్న లక్ష్మి మాట్లాడారు. డిఎస్‌పి హేమలత,దిశ విభాగం డిఎస్‌పి రామరావు, ఎంఇఒ మురళీధర్, సిజెడబ్ల్యుసి చైర్మన్ ఇ .శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి ఉన్నారు.

'సోమశిల' నుంచి
1,800 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా సోమశిల జలాశయం నుంచి సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల 14న జరిగిన ఐఎబి సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సోమశిల డిఇ ధశరధరామారెడ్డి అనంతసాగరం మండలం, సోమశిల డ్యాం వద్ద 12వ క్లస్టర్ గేటు నుంచి 1800క్యూసెక్కులు నీటిని పెన్నా డెల్టాకు విడుదల చేశారు. 11రోజుల పాటు రోజు 1800క్యూసుక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1నుంచి మరో 100 క్యూసెక్కులు పెంచుతామని తెలిపారు. సోమశిల పూర్తి సామర్థ్యం 78టిఎంసిలు. ప్రస్తుతం 29.455టిఎంసిలు నీరు ప్రాజెక్టులో ఉంది. ప్రస్తుతం నెల్లూరు.జిల్లాలో తొలిపంట సాగుచేస్తున్నారు. డెడ్ స్టోరేజ్ తాగు,నీరు ఇతర అవసరాలకు పోను కేవలం 7టిఎంసిలు మాత్రమే నీటిని విడుదల చేస్తామని, 66వేల ఎకరాలకు మాత్రమే నీటిని సరఫరా చేస్తామని ఐఎబిలో ప్రకటించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పలువురు ఎంఎల్ఎలు, రైతు సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈనెల 20నుంచి 2.20లక్షల ఎకరాలకు నీరిస్తామని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం సోమశిల నుంచి నీరు విడుదలచేశారు. ఈ మాసంలో వర్షాలు, వరదల వల్ల ప్రాజెక్టుల్లోకి నీరు వస్తాయని ఆశతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక వేళ సకాలంలో వర్షాకాలంలో వాన కురవకపోతే ప్రస్తుతం సాగుచేయనున్న పొలాలతోపాటు నెల్లూరు జిల్లా ఎడారిగా మారే ప్రమాదం ఉంది.కార్యక్రమంలోసెంట్రల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నాగరాజు, సెంట్రల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనిల్ కుమార్ రెడ్డి, సోమశిల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్ర ప్రసాద్, జేఈ రామ్మోహన్ రెడ్డి, నిఖిల్ పాల్గొన్నారు.



'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వర పరిష్కారం

నెల్లూరు : జగనన్నకు చెబుదాం- కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువు లోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మనాథ్, డిఆర్‌ఒ లవన్న , జెడ్‌పి సిఇఒ చిరంజీవి లతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జెసి కూర్మనాథ్ మాట్లా డుతూ జగనన్నకు చెబుదాం.. కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించి నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించేలా కషి చేయాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీ మళ్లీ మళ్లీ రాకుండా సమస్యను సంతప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని సూచించారు. మెప్మా, హౌసింగ్, ఐసిడిఎస్ పిడిలు రవీంద్ర, నాగరాజు, హేన సుజన, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, డిఎస్‌ఒ వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి ఉన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన 128 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని ఎస్‌పి డాక్టరు కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం పోలీసు 'స్పందన' కార్యక్రమం ముగిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. స్పందనకు మహిళలు, వద్దులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు, దివ్యాంగుల నుంచి అందిన ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా పోలీసు స్టేషన్ల సిబ్బందికి సూచించామన్నారు. స్పందన కార్యక్రమంలోనే కాకుండా బాధితులు ఫిర్యాదులు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వచ్చిన సమయంలో వారి సమస్యలను పోలీసు సిబ్బంది సహనంతో వ్యవహరించి బాధితుల సమస్యలను సానుకూలంగా వినిఅర్థం చేసుకొని భద్రతా, భరోసా కల్పించి సమస్యను పరిష్కరించేందుకు పటిష్టమైన చర్యలు తీసు కోవాలన్నారు. అడిషినల్ ఎస్‌పి (అడ్మిన్), ఎస్‌సి,ఎస్‌టి సెల్ -2 డిఎస్‌పి, ట్రైనీ డిఎస్‌పి కుమారి హేమలత, ఎస్‌బి సిఐ, ఆర్ఐ, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మార్కెట్ కమిటీల ఏర్పాటుతో
రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతులకు విస్తత సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి ఓ మార్కెట్ కమిటీని ఏర్పాటుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమ వారం నగరంలోని ఓ ప్రముఖ కళ్యాణ మండపంలో నిర్వహించిన నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సులభతర సేవలందిం చడమే లక్ష్యంగా మార్కెటింగ్ శాఖలో సరికొత్త విధానాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. సంఘ బంధాల తరహాలో రైతు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైతు పండించిన పంటలను ఇంటి నుంచే విక్రయించేలా ఈ-ఫామ్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి వ్యవసాయ కమిటీ చైర్మన్ గా రైతులకు మంచి సేవలు అందించాలని మంత్రి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లా డుతూ రైతులకు మెరుగైన సేవలు సకాలం అందించేందుకు నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం నెల్లూరు ఏఎంసీ చైర్మన్ గా పేర్నాటి కోటేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా ఒట్టూరు సుధాకర్ యాదవ్, పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి జయ వర్ధన్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మార్కెటింగ్ శాఖ ఎడి అనిత ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ , ఐక్యూఏసి ఆధ్వర్యంలో ఓటర్ల విద్య , ఎన్నికల భాగస్వామ్యం అనే అంశంపై ఓటర్లకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహశీల్దార్ శాంసన్ , రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ హాజరై విద్యార్థులకు ఓటరుగా నమోదు కావడానికి కావాల్సిన అర్హతలు, ఓటరు నమోదు ప్రక్రియ వంటి అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కో-ఆర్డినేటర్, డా. పి రాజగోపాల్ బాబు మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు ఎన్నుకునేటప్పుడు పౌరులు చైతన్య వంతంగా వ్యవహరిస్తూ ఓటు హక్కుని వినియోగించుకోవాల్సిందిగా విద్యార్థులకు పిలు పునిచ్చారు. వైస్- ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు నరేంద్ర ఉన్నారు.




ఇంటింటా టిడిపి ప్రచారం

ప్రజాశక్తి- కందుకూరు : టిడిపి కందుకూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్, పోతురాజుమిట్ట ప్రాంతాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ఇతర నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనా వైఫల్యాలు వివరించడంతోపాటు, టిడిపి మినీ మేనిఫెస్టో పథకాలను తెలియజేస్తూ ష్యూరిటీ బాండ్లను వివరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శీను, వార్డు అధ్యక్షుడు షేక్ ఖలీల్, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సలాం, బాషా, హషిం, రసూల్, గౌస్ బాషా, రియాజ్, అమిరుల్లా బాబు, షఫీ, నయూమ్, మాభాష వలీబాషా, భాషిద్, రహంతుల్లా, జూబేర్, ఖాదర్ బాషా, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ మున్నా ఉన్నారు.

చంద్రబాబుకు బెయిల్ మంజూరుపై హర్షం

ప్రజాశక్తి- కందుకూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ కేసుకు సంబంధించి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కోటపాటి జనార్ధన్‌రావు తెలిపారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగంగా చంద్రబాబుపై నిరాధారమైన ఆరోపణలతో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో అవినీతి జరిగిందని గగ్గోలు పెట్టినా "న్యాయం గెలిచింది - ప్రజలకు నిజం తెలిసిందని" అని కోటపాటి అన్నారు. 2024 సంవత్సరంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని కోటపాటి జనార్దన్ రావు అన్నారు.



కోటపాటి జనార్ధన్‌రావు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-కందుకూరు : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ సోమ వారం జరిగింది. వారోత్సవాల పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ముఖ్య అతిథిగా ఎంఇఒ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి స్పోకెన్ ఇంగ్లీష్ ఇచ్చిన దాతలు మాలకొండయ్య, విశరత్ బాబు విద్యార్థులకు ఇచ్చారు. కన్సోలేషన్ బహుమతి పాఠకులు సుబ్బారావు విద్యార్థులకు ఇచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని మా రోజుల్లో ఎంతో విలువైన పుస్తకాలు ఉండేవి కాదని ఇప్పుడు జనరేషన్ మంచి విలువైన పుస్తకాలు గ్రంథాలయంలో ఉండేలాగా ప్రభుత్వం మంచి విలువైన జ్ఞాన సంపదను ఇచ్చేటువంటి పుస్తకాలను పంపిణీ చేస్తుందని ఎంఇఒ చెప్పారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు నాగరజని పాల్గొన్నారు.

ఉలవపాడు : ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ చంచమ్మ ,ఎంఇఒ ప్రసాద్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ వారం రోజులు పాటు జరిగిన వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన 265 మంది విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్థిక సాయం అందజేసిన గోగినేని జానకి ,చెంచు రామానాయుడు కి గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ధన్య వాదాలు తెలిపారు.ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు పీవీ సుధాకర్ రావు, జీవన్ జ్యోతి, రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ సీఈవో వై బాలచంద్ర ఉన్నారు.



గుంతలు తీశారు.. పనులు మరిచారు.!

ప్రహరీ నిర్మాణంలో అలసత్వం - అధికారుల తీరుపై విమర్శలు

ప్రజాశక్తి - వలేటివారిపాలెం

వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణానికి నాలుగైదు నెలల కిందట పిల్లర్లు, గుంతలు తీశారు. అయితే నిర్మాణం పనులు చేపట్టకుండానే అలాగే వదిలేశారు. దీంతో పిల్లర్ల గుంతలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో అన్ని గ్రామాలలో జరుగుతున్న అభివద్ధి పనులను నిత్యం పర్యవేక్షించి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకునే ఎంపీడీవో తమ కార్యాలయం ప్రహరీగోడ నిర్మాణ పనులలో ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు ఉన్నా నిర్మాణ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి. వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయం ప్రహరిగోడ నిర్మాణానికి మండలం గ్రాంట్ నుండి సుమారు రూ 6 లక్షలతో నిధులు వెచ్చించారు. పిల్లర్లకు గుంతలు తీశారు.. ఇసుక, కంకర మెటీరియల్ తోలి పనులు చేపట్టకుండా అలాగే వదిలేసారు. తీసిన పిల్లర్ల గుంతలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దళితుల భూములు ఆక్రమణ

అడ్డుకున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-గుడ్లూరు : నిరుపేద దళితులు సాగు చేసుకుంటున్న భూములను రాత్రికి రాత్రే కొందరు భూస్వాములు ఆక్రమించుకుంటున్న సమస్య గురించి తెలుసుకున్న బాధిత దళితులు భూస్వాములను అడ్డుకున్న సంఘటన గుడ్లూరు మండలం గుండ్లపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 237 నంబర్ గల సర్వే భూమిలో సుమారు 150 ఎకరాలు పశువుల పోరంబోకు భూములను గత కొంతకాలంగా గుళ్లపాలెం గ్రామానికి చెందిన దళితులు, గిరిజనులు, బిసిలకు చెందిన నిరుపేద వర్గాల వారు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు.ఈ భూములను రాత్రికి రాత్రి ట్రాక్టర్లను పొలంలో పెట్టి దున్నుతూ ఆక్రమించుకోవడంతో మంచికిలపాటి ప్రభుదాసు ,ఉచ్చులూరి ప్రసాదు, చేవూరి రాఘవులు, బి ఆదాం ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన నిరుపేదలు, పొలాల దగ్గరికి చేరుకొని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక రెవెన్యూ అధికారులకి ఫిర్యాదు చేశారు. వివాదాస్పద పొలం దగ్గరికి చేరుకున్న రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇరు వర్గాలు శాంతించాలని స్థానిక తాసిల్దార్ సూర్య నారాయణ సింగ్ తెలియజేశారు. భూముల్ని ఆక్రమించుకునే ముందు భూస్వాములు కొందరు నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలు పుట్టించి నిరుపేద దళితుల భూములు కి ఏసూరు పెట్టారని ఇటీవల నిర్వహించిన భూ సర్వేలో దళితులు సాగు చేసుకుంటున్నట్లు రికార్డుల్లో నమోదయి ఉన్నదని రెవిన్యూ అధికారులు వివరించారు. అయితే భూస్వాములు రాజకీయ పలుకుబడి ఉపయోగించి దళితుల భూములు ఆక్రమించారని బాధ్యత దళితులు ఆరోపించారు. భూ సమస్య పరిష్కారం చేయాలని బాధ్యత దళితులు హైకోర్టుని ఆశ్రయించారు. హైకోర్టు యధాస్థితి ఉంచాలని తాతకాలిక తీర్పు ఇవ్వడంతో తిరువర్గాల మధ్య వివాదం చెలరేగిందని బాధిత దళితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కోర్టు తీర్పు ప్రకారం అందరూ నడుచుకోవాలని తహశీల్దార్ సూర్యనారాయణ సింగ్ తెలిపారు.



పెత్తందారులు దున్నిన భూమి ఇదే..

'మా నమ్మకం నువ్వే జగనన్న..

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని మాచవరం గ్రామ సచివాలయం పరిధిలో "మా నమ్మకం నువ్వే జగనన్న" 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే" కార్యక్రమాన్ని మాచవరం సర్పంచ్ పొట్లూరి లలిత, కందుకూరు మండల వైసిపి అధ్యక్షుడు గంగవరపు వెంకటరావు, కందుకూరు మండల కో-ఆర్డినేటర్ చీమల వెంకట రాజాల అధ్యక్షతన ప్రారంభించారు. అనంతరం గృహ సారధులు, వాలంటీర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కందుకూరు మండలానికి ఈ కార్యక్రమానికి సంబంధించి నోడల్ ఆఫీసర్ చంద్రసేన్ అధ్వర్యంలో గ్రామ సచి వాలయం పరిధిలో సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ఎంత లబ్ధి పొందింది వారికి తెలియజేసేలా "సంక్షేమ పథకం బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసిలు దండే కోటేశ్వరరావు, కష్టూటి శ్రీనివాసులరెడ్డి, కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు, జి.మేకపాడు సర్పంచ్ గూడపాటి బ్రహ్మయ్య, కొండికందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, పార్టీ నాయకులు తొట్టెంపూడి శ్రీనివాసరావు, ఇంటూరి మాధవరావు, కొత్త రాఘవరెడ్డి, గోసల వెంకారెడ్డి ఉన్నారు.





కమిషనర్‌కు వినతిపరతం అందజేస్తున్న కమిటీ సభ్యులు

విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి-కందుకూరు : కీర్తిశేషులు మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలని సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కందుకూరులో విగ్రహం పతిష్ట ఫర్మిషన్ కోసం కందుకూరు శాసన సభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కందుకూరు మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఎపిజె అబ్దుల్ కలాం కమిటీ ముఖ్యులు ముజీబ్ , సందానీ బాషా ఉన్నారు.

టిడిపి నాయకుల హర్షం

ప్రజాశక్తి-కందుకూరు : నారా చంద్రబాబునాయుడుయిఅ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడం పట్ల కందుకూరు నియోజకవర్గ టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కందుకూరులోని కార్యాలయంలో పార్టీ నేతలు బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, చదలవాడ కొండయ్య, నాదెళ్ల వెంకట రమణయ్య, షేక్ రఫీ, గోచిపాతల మోషే, కొచ్చర్ల శ్రీను, షేక్ సలాం, షేక్ ఫిరోజ్, వడ్డేళ్ళ రవిచంద్ర, కొత్తూరు వెంకట సుధాకర్, చుండూరు శ్రీను, వలేటి వెంకటేశ్వరరావు ఉన్నారు.




ప్రజాసంక్షేమమే సిఎం ధ్యేయం



కరపత్రాలు పంచుతున్న దృశ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని ఆత్మకూరు జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లురుపాలెం సచివాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక 22, 23 వార్డుల్లో ఇళ్లను సందర్శించి ప్రజలకు అందుతున్న పథకాల గురించి వివరించారు. అక్కడి ప్రజలు తమకు అందుతున్న పథకాలపై ఆనందం వ్యక్తం చేస్తూ రాబోవు ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. అనంతరం 23వ వార్డులోని ముఖ్య నాయకుడు గడ్డం జనార్ధన్‌రెడ్డి గృహంలో వార్డు ముఖ్య నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే అంశంపై చర్చించి వారి మద్దతు కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారం వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు సర్దార్, డాక్టర్ శ్రావణ్ కుమార్, వార్డు కౌన్సిలర్ చెరుకూరు కామాక్షయ్య నాయుడు, పట్టణ పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, పలు వార్డుల కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.



డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-వరికుంటపాడు : ప్రజాసంక్షేమం, ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెంపొందించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ అలీఅహ్మద్, వరికుంటపాడు సర్పంచ్ కొండేపు దిలీప్ కుమార్ అన్నారు. రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సోమవారం విరువూరు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజుపల్లిలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల జగన్ పాలన గతంలో చంద్రబాబు పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 2024 ఎన్నికలలో చంద్రబాబు 650 హామీలు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చాక వాటిని ఏ విధంగా నీరుగార్చాడో గుర్తు చేసుకోవాలని కోరారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు జవాబుదారీ పాలన అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను చేరవేస్తున్న జగన్‌ను మరోసారి రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చేవూరి శ్రీదేవి, ఇఒపిఆర్‌డి సికిందర్, ఎం.ఎల్.ఒ. నారాయణ రాజు, వైసిపి కన్వీనర్ మందలపు తిరుపత నాయుడు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మాగంటి శ్రీనివాసులు, జెసిఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వరరెడ్డి, ఎంపిటిసి కాలే లక్ష్మీదేవి, సర్పంచులు పేర్నంపాటి పెద్ద మౌలాలి, ఎర్రమల ప్రభాకర్ రెడ్డి, కుమ్మిత ప్రతాపరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జిలాని, వైసిపి నాయకులు చెన్నా రాయుడు, కాలే రమేష్, బత్తుల వెంకటరమణ, తిరుపతి రెడ్డి, ఆంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

సోమశిల ఆయకట్టును డెల్టాగా పరిగణించాలి



ప్రజాశక్తి - కావలి రూరల్ : బ్రిటీష్‌కాలం నాటి డెల్టా ప్రాంత గుర్తింపు విధానాన్ని పునసమీక్షించాలని సోమశిల ప్రాజెక్ట్ అధికారిక ఆయకట్టు అంతటినీ డెల్టా ఏరియాగా పరిగణించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై ఆయన తన కార్యాలయం వద్ద మాట్లాడుతూ డెల్టా పేరుతో జిల్లాలో సాగునీటి వరంగా ఒకే ప్రాంతానికి పదేపదే ప్రయోజనం కల్పిస్తూ మిగిలిన రైతులను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. సోమశిల ప్రాజెక్ట్ లేకముందు సంగం, నెల్లూరు బ్యారేజ్‌ల ద్వారా సర్వేపల్లి, కనిగిరి చెరువులకు నీరు వెళ్లేది సుమారు 6లక్షల నీటి నిల్వకు అవకాశం ఉండేది, 60 నుంచి 70 వేల ఎకరాల్లో పంటలు పండేవన్నారు. అప్పట్లో ఆ ప్రాంతాన్ని డెల్టాగా పరిగణించే వారన్నారు. సోమశిల ప్రాజెక్ట్ నిర్మాణం తర్వాత నీటి లభ్యత స్థిరీకరణ కావడం జరిగిందన్నారు. తద్వారా డెల్టా ప్రాంత ప్రధాన విస్తరణతో పాటుగా కావలి కాలువ, కనుపూరు కాలువ, ఉత్తర కాలువ నిర్మాణాలను చేపట్టి 1,30,000 ఎకరాలను సాగు యోగ్యం చేసి ప్రధాన ఆయకట్టులో చేర్చారన్నారు. మారిన పరిస్థితుల్లో సోమశిల ప్రాజెక్ట్ కింద ప్రధాన ఆయకట్టు అంతటినీ డెల్టాగా పరిగణించాలని అన్ని ప్రాంతాల రైతులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన చట్టపర ద్వారా డెల్టా అన్న పదానికి సరికొత్త నిర్వచనం చెప్పి రైతాంగానికి సమన్యాయం చేయాలని కోరారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఎంఎల్‌ఎలు, నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. నీరు తక్కువగా ఉన్నప్పుడు మొత్తం ఆయకట్టులో రైతులందరికీ సమన్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇందుకోసం అవసరమైతే వంతుల వారీ విధానం అమలులోకి తేవాలన్నారు. ప్రస్తుతం రెండు పంటలు పండించుకున్న డెల్టా ప్రాంతాన్ని మినహాయించి ఇతర ప్రాంత రైతాంగానికి సాగునీరు ఇవ్వాలని కోరారు. ఒక నియోజక వర్గంలోనే డెల్టా.. నాన్ డెల్టా ప్రాంతాలుగా విభజించడం సాగునీటి సరఫరాలో తారతమ్యం చూపడం శోచనీయమన్నారు. అవసరమైతే ప్రజా ఉద్యమానికి తెరతీస్తామని హెచ్చరించారు. కావలి,ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలు జాగృతం కావాలని పిలుపునిచ్చారు.

స్వల్ప రుణాలపై రైతులు దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ప్రస్తుతం వ్యవసాయం సాగు చేస్తున్న రైతులు నీటి లభ్యత వల్ల స్వల్ప కాలిక రకాలపై దృష్టి పెట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమాలకు ఆయా గ్రామాల రైతులు హాజరై అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు తప్పక పాటించాలని పేర్కొన్నారు.

పటిష్టంగా 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-కోవూరు : మండలంలో డిసెంబర్‌లో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేలా ఫిజికల్ డైరెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎంపిడిఒ శ్రీహరి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం వారీగా ఈ పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఒక్కో సచివాలయానికి ఒక పీఈటీ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రమేష్, ఎంఇఒ-2 వై. చెంచులక్ష్మయ్య, ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, దేలీలా, పీఈటీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సదరంకు సంబంధిత పత్రాలతో రావాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారాలూ సదరం పరీక్షల కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా వారికి సంబంధించిన పత్రాలతో రావాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రవిబాబు తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన సదరం క్యాంపులో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలకు వచ్చే రోగులు పేరును నమోదు చేసుకున్న తరువాత వారికి వచ్చే మెసేజ్ తప్పనిసరిగా ఒక కాపీ జెరాక్స్ తీసుకురావాలన్నారు. సోమవారం నిర్వహించిన సదరం క్యాంపులో 15 మంది నమోదు చేసుకోగా... కేవలం 8 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ కిషోర్ ఉన్నారు.

కులగణన సర్వేపై శిక్షణ



ప్రజాశక్తి-జలదంకి : జలదంకి విద్యా వనరుల కేంద్రం, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.సింగయ్య వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి కులగణనపై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కావలి ఆర్ డి ఓ సీనా నాయక్ మాట్లాడుతూ కులగణన సర్వే ఎలా నిర్వహించాలో... అందులో లోటుపాట్లను సచివాలయ సిబ్బంది వాలంటీర్లకు తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులను ఎంపిడిఒ సింగయ్య, తహశీల్దార్ పర్యవేక్షించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీధర్, నాగేశ్వరావు, కొన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శివాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని గాంధీపాళ్యం సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీకమాసంలో వచ్చే ప్రథమ సోమవారం సందర్భంగా ప్రాతః కాలమునే ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్మద నది నుంచి తెచ్చిన నర్మద బాణ లింగాలకు సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉభయకర్తలుగా కోవూరు ఎఎంసి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేష్, ధర్మకర్త మండలి సభ్యులు పి.సాంబ, ఏ.హనుమారెడ్డి, దత్తకులు మురళి స్వామి, సుబ్బారావు స్వామి, వంశీస్వామి, శేఖర్ స్వామి, తదితరులు ఉన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

నాసిరకం ఇళ్ల నిర్మాణాలపై విచారించాలి

ఆర్‌డిఒను కోరిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక బృందం

ప్రజాశక్తి-కావలి

కావలి జగనన్న మెగా లేఅవుట్‌లో చిరుజల్లులకే కూలిపోతున్న నాసిరకం ఇళ్ల నిర్మాణాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ వి.కె. శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేదిక కన్వీనర్ కరవది భాస్కర్ (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), పసుపులేటి పెంచలయ్య (సిపిఎం), కొప్పర్తి నాగరాజు(సిపిఐ), జ్యోతి బాబురావు (టిడిపి), ఎం.షికేష్ (జనసేన) మాట్లాడారు. "పిచ్చుక గూళ్లు, కాకుల గూళ్లు కంటే జగనన్న ఇళ్ల నిర్మాణం దారుణంగా ఉందని" ఎద్దేవా చేశారు. అంతేకాకుండా అంతులేని అవినీతి బాగోతం చోటుచేసుకుందని తక్షణమే సమగ్రమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ పేరుతో ప్రభుత్వ ఖజానాకు కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గండి,బండి,కొట్టి నయా బంది పోటుగా మారాడని ఆరోపించారు. నాడు ఎంఎల్‌ఎ అమ్మిన రేటుకు నేడు ఒక్క ఎకరా అయినా ఎంఎల్‌ఎ కొనగలరా అని ప్రశ్నించారు. చదును పేరుతో కోట్లరూపాయల గ్రావెల్ అమ్ముకున్నారన్నారు. నీటి



ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక

కనెక్షన్లు పేరుతో నాసిరకం పైపులు వేయడమే కాకుండా, ఎన్ని బోర్లు వేశారు.. ఎంత నీటిని సరఫరా చేశారో.. చెప్పాలన్నారు. క్యూరింగ్ పేరుతో ప్రయివేట్ ట్యాంకర్లతో నీటిసరఫరా చేస్తూ దొంగబిల్లులు చేసుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి జరగట్లేదని అంటున్న స్థానిక ఎంఎల్‌ఎ జగనన్న ఇళ్లపై విచారణ కమిటీని వేయించగలరా అని సవాల్ విసిరారు. జగనన్న ఇళ్ల నిర్మాణం చూసినా, అక్కడ జరుగుతున్న బాగోతం చూసినా అవి పేదల కోసం కడుతున్న ఇళ్లు కాదు అవినీతి గద్దలైన పెద్దల కోసం జరుగుతున్న వ్యవహారమని తెలిసిపోతుందన్నారు. ఇంత నాసిరకం నిర్మాణం జరుగుతున్నా, క్వాలిటీ కంట్రోల్ అధికారులు కానీ, హౌసింగ్ బోర్డ్ అధికారులు కానీ, కనీసం పరిశీలించక పోవడం దారుణమన్నారు. హౌసింగ్ బోర్డు అధికారులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాసిరకం ఇళ్ల నిర్మాణానికి పూనుకొని పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నారు. ఇది ఏ ఒక్క ఇంటి సమస్య కాదని, 9వేల కుటుంబాల సమస్య అని తెలియజేశారు. 9వేల కుటుంబాల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అతిపెద్ద అవినీతి బాగోతమని ఉద్ఘాటించారు. జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఇంత ఆందోళన జరుగుతున్నా ఆర్‌డిఒ పరిశీలించకపోవడం శోచనీయమన్నారు. తాము శాంతియుతంగా ధర్నా చేస్తుంటే కావలి రూరల్ సిఐ రాజేష్ అత్యుత్సాహం ప్రదర్శించారని, ధర్నా చేయకూడదని, నినాదాలు ఇవ్వకూడదని పోలీసు జులుం ప్రదర్శించాడన్నారు. నిరసన తెలియజేసే హక్కును కాలరాసే విధంగా, అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించాడన్నారు. అధికార పార్టీ దగ్గర మార్కులు కొట్టేయడానికి విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పసుపులేటి మహేష్, గోసల రవికాంత్, గడే నాగార్జున, తోట చరణ్, కళ్యాణి, వేణు, మస్తాన్, సునీల్, రఫీ, తదితరులున్నారు.

ఉత్తర కాలువ కింద రైతులకు నీరు ఇవ్వాలి



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కావలి రూరల్

కావలి ఉత్తర కాలువ కింద రైతులకు ఆరుతడి పంటలకు సోమశిల నీరు ఇవ్వాలని కోరుతూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ శీనా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.మాలాద్రి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్ మాట్లాడుతూ కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల్లో వర్షాలు లేక వరిపైరు గానీ ఆరుతడి పంట గానీ రైతులు వేసుకోలేదని కొన్ని గ్రామాల్లో వర్షాలు కురుస్తాయని ఆశతో వరి నార్లు పెంచుకుంటున్నారని తెలిపారు. జిల్లా ఇరిగేషన్ బోర్డు సమావేశంలో కావలి కాలువకు ఉత్తర కాలువకు నీరు ఇచ్చేది లేదని నిర్ణయించారని తెలిపారు. దానివల్ల వరుసగా ఆరుతడి పైర్లు కూడా లేని ఉత్తర కాలువ కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం యడగారుకు (రెండవ పంటకు) సోమశిల నీరు విచ్చలవిడిగా వాడి అసలు ఇప్పుడు ఒక ఆరుతడి పంటకు కూడా నీరు ఇవ్వకుండా ఈ సంవత్సరం చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా సోమశిల నీరు పొదుపుగా వాడి కావలి కాలువ కింద మండలాలైన కావలి, బోగోలు, జలదంకి, దగదర్తి ఉత్తర కాలువ కింద ఉన్న కలిగిరి కొండాపురం లింగసముద్రం మండలాల రైతులకు సాగునీరు అందించి ఒక ఆరుతడి పంటకైన నీరు వదిలి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పేముల సీతారామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి యం రాధాకష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు

కనుపూరు కాలువ ద్వారా నెల్లూరు రూరల్ మండలంలోని గొల్ల కొందుకూరు నుంచి ఆమంచర్ల వరకు సుమారు 17వేల ఎకరాలకు పంటలు సాగు చేసుకునేందుకు నీళ్లు ఇప్పించాలని కోరుతూ సిపిఎం నాయకులు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జెసి కూర్మానాథ్‌కు మండలంలోని సౌత్‌మోపూరు, ములుమూడి, పాత వెల్లంటి, కొత్త వెల్లంటి, కందమూరు గ్రామాల రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నెల్లూరు రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాల్, మండల రైతుసంఘం కార్యదర్శి పి.జనార్దన్ మాట్లాడుతూ కనుపూరు కాలువ కింద సుమారు 70వేల ఎకరాలలో పంటలు పండుతుండేవన్నారు. అందుకు స్థిరీకరించబడిన ఆయకట్టు 33వేల ఎకరాలలో గ్రామాలలోని కొంతభాగం తమకు ఉన్న బోర్లు కిందసాగు చేసుకున్నారని తెలిపారు. సోమశిల నీళ్లు వస్తున్నాయని ఆశించి వీళ్లంతా నార్లు పోసుకుంటే, మిగిలినవాళ్లు చెరువులకు నీళ్లు ఇచ్చినప్పుడు నారు పోసుకోవాలని ఎదురు చూస్తున్నారని తెలిపారు. 14వ తేదీన జరిగిన సాగునీటి సలహా బోర్డు సమావేశంలో కనుపూరు కాలువకు నీరు ఇవ్వమని చెప్పినట్లు తెలుస్తుందని, మొదట కనుపూరు కాలువకు 17వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాల్సిన ప్రతిపాదన పెట్టినారని, కానీ ప్రస్తుతం నీళ్లు ఇవ్వలేమని చెప్పడంతో 17వేల ఎకరాలలో అనేకమంది రైతులు నష్టపోతారని తెలిపారు. కాబట్టి సోమశిల ప్రాజెక్ట్ వలన పంటలు పండించుకుంటున్న మా జీవనాధారాన్ని నిరాకరించకుండా కనుపూరు కాలువకు కనీసం ఆమంచర్ల వరకు వెంటనే సాగునీరు అందించి గ్రామాలను రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పల్లవరపు చెంచయ్య, పల్లవరపు సుబ్రహ్మణ్యం, పాదర్తి మస్తానయ్య, పాదర్తి నారాయణ, వద్దూరు సుబ్రహ్మణ్యం, అట్ల అంజయ్య, వల్లా నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



శివాయి భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలో పేదల అనుభవంలోని శివాయి, రోడ్డు, కాలువ పోరంబోకు, పేదల అనుభవం ఉన్న సాగు చేసుకునే భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ పేదల ఆధీనంలో కొన్ని సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న శివాయి పోరంబోకు స్థలాలకు ప్రభుత్వం సర్వహక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం రీసర్వే పేరుతో రైతుల మధ్య గ్రామాలలో కొత్త తగాదాలను సృష్టిస్తున్నారన్నారు. నివారించేందుకు అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కొంతమంది రైతులకున్న భూమి లేనట్టుగా తక్కువ కొలతలతో పట్టాలిస్తున్నారన్నారు. సమగ్రంగా రైతుకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం ద్వారా రాయితీలు అందరికీ అందే విధానం చూడాలన్నారు. గ్రామాల్లో పేదలపై పెత్తందారుల కక్ష సాధింపులను మానుకో వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్‌కె బాబు, ఆవాజ్ నాయకులు చాన్‌బాషా, కలేషా, సిఐటియు నాయకులు మణిశర్మ, కాకి నర్సింహులు, కార్మిక సంఘం నాయకులు, విజయ్ కుమార్, రమణమ్మ, శంకరమ్మ, లక్ష్మమ్మ, రాజేశ్వరి, రత్నమ్మ, ఫాతిమా, నాగరత్నం, సునీత, నర్మద, శీనయ్య పాల్గొన్నారు.

యుఇఇయు కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి-కావలిరూరల్

పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో సిఐటియు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కామ్రేడ్ శ్రీహరి భవనాన్ని సోమవారం సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టివివి ప్రసాద్, కె.అజయ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కావలి పట్టణంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈ భవనాన్ని ప్రారంభించడం ఈ భవనానికి కామ్రేడ్ శ్రీహరి పేరుపెట్టడం చాలా ఆనందదాయకమైన విషయమని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు కార్యాలయం ఈ జిల్లాలో కావలి పట్టణంలో మొదటగా ప్రారంభించినట్లు తెలిపారు. యుఇఇయు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. వారు చేసే పోరాటాలకు సిఐటియు ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ నూతన కార్యాలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. యుఇఇయు రాష్ట్ర అధ్యక్షులు డి.సూరి బాబు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ మేనేజ్ మెంట్ అలసత్వం వహిస్తుందని ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఎస్‌ఇ ఆర్డర్లు ఇచ్చిన తర్వాత కూడా వాటిని అమలు చేయడం లేదన్నారు. ట్రాన్స్‌కో మేనేజ్ మెంట్ పీఆర్సీ సందర్భంగా అరియర్స్ 12 ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఇస్తామని చెప్పారని, అవి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. రెండు డిఎలు పెండింగ్లో ఉన్నాయని వాటిని ఇవ్వలేదని, కాంట్రాక్ట్ లేబర్ కింద పనిచేసే కార్మికులకి నాలుగు రకాల జీతాలు ఇస్తున్నారని, ఒకే రకం పనిచేస్తున్న కార్మికులందరికి ఒకే జీతం ఇవ్వాలని సబ్ స్టేషన్‌లో ఉన్న కాళీలను భర్తీ చేయక పోవడంతో పనిచేస్తున్న కార్మికులపై పని ఒత్తిడి పెరిగిపోతుందన్నారు. రాబోయే రోజుల్లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై పోరాటాలకు కామ్రేడ్ శ్రీహరి నూతన భవనం ఎంతో ఉపయోగ కరమని తెలిపారు. కార్యక్రమంలో కెవిసి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంకరయ్య డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఐటియు కావలి ఇన్‌ఛార్జి ఎస్‌కె రెహానా బేగం, సిఐటియు కావలి పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్, యుఇఇయు జిల్లా అధ్యక్షులు సుధాకర్ రావు, దయాకర్, సుబ్రహ్మణ్యం, చిన్నయ్య, యూనియన్ కార్యదర్శి పి అంకయ్య, జాకీర్ హుస్సేన్, గిరిబాబు తదితరులున్నారు.



నిరసన చేపడుతున్న నాయకులు

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ దృష్టిలో ఉంచుకొని వారికి రావాల్సిన జీతాలు, 2017 అలయన్స్ బకాయిలు చెల్లించాలని కోరుతూ, కార్మికుల అందరినీ పర్మినెంట్ చేయాలని సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కొప్పోలు డేవిడ్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎన్నికల వాగ్దానంగా ప్రతీ అవుట్‌సోర్సింగ్ కార్మికుడిని రెగ్యులర్ చేస్తామని, హామీనిచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. అందరం కూడా ఆయనను నమ్మి ఓట్లు వేస్తే ఆయన ముఖ్యమంత్రి అయ్యాడని, కానీ కార్మికుల సమస్యలు మాత్రం మర్చిపోయాడని తెలిపారు. కార్మికులకు నెలనెలా జీతాలు అందక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మిక హక్కులు సాధించుకునేందుకు సిఐటియు పిలుపు మేరకు దీర్ఘకాలికంగా పోరాటాలు నడపడం ఎంతో అవసరమన్నారు. అనంతరం మున్సిపల్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఎస్‌డి రిజ్వాన్, టి.శ్రీనివాసులు, సిహెచ్ ఈశ్వరయ్య, ఏ.చెన్నకేశవులు, జి.నాగేంద్ర, వెంకటేశ్వర్లు, కొండా రామయ్య, గురవయ్య, తదితరులున్నారు.

కులగణనను పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపిపి కేత వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కులగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో కరటంపాడు, రామస్వామిపల్లి, చర్లో ఎడవల్లి, వెన్నవాడ, వాసిలి సచివాలయాల పరిధిలోని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కులగణనపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమము పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. అన్ని గ్రామాలలోని అన్ని కుటుంబాలను పరిగణనలోనికి తీసుకొని సర్వే నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సర్వేకు సంబంధించిన పలుసూచనలను సిబ్బందికి తెలియజేశారు. వలంటీర్ మొబైల్ యాప్‌లో ఈ సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, సర్వే పూర్తి చేసిన తర్వాత సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కుటుంబ సభ్యులు ఈ కెవైసి నమోదు చేయాలని తెలియజేశారు. 27వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు సర్వే నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. క్యాస్ట్ సర్వేకు సంబంధించి మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన హౌసింగ్ డిఇ శ్రీహరి గోపాల్, ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి ఉషా రాణి, ఎంఇఒ-2 చలపతి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు.

ప్రజాశక్తి-కోవూరు : మండలంలో ఈ నెల 27వ తేదీ నిర్వహించనున్న కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ శ్రీహరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నచివాలయ ఉద్యోగులు, సంబంధిత వాలంటీర్లతో ఈ సర్వేకు సంబంధించి శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, తదితరులున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రధానమైన నీటి సమస్యను జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, వైస్ ఎంపిపి మట్ల శాంతి తమసొంత నిధులతో నీటి సమస్యను పరిష్కరించారు. సోమవారం స్థానిక చాకలి వీధిలోని నీటి సమస్యతో స్థానికులను ఎదుర్కొంటున్న ఇబ్బందులను తక్షణమే స్పందించిన జిల్లా కోఆప్షన్ సభ్యులు మట్ల లక్ష్మయ్య, రామయ్య తమ సొంత నిధులతో మరమ్మతుల గురైన మోటర్‌ను రిపేర్ చేయించి నీటిని అందించారు. దానితో చాకలివీధి ప్రజలు వారికి అభినందనలు తెలిపారు. మరికొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకురాగ సైడ్ కాలువల మరమ్మతులు వీధి దీపాలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా స్పందించిన కోఆప్షన్ సభ్యులు వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సమస్యలను సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు దస్తగిరి అహ్మద్, యువనాయకులు షర్ఫుద్దీన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించండి

- ముఖ్యమంత్రిని కలిసిన ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజక వర్గంలో ప్రజల ఆకాంక్షల మేరకు అవసరమైన అభివృద్ధి కోసం తమసంపూర్ణ సహకారం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల గురించి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మెట్టప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులతో పాటు నియోజకవర్గంలో రైతాంగం కోసం అవసరమైన హైలెవల్ కెనాల్ నిర్మాణ పురోగతిపై వివరించి పనులు వేగవంతం జరిగేలా చూడాలన్నారు. సోమశిల జలాశయం ఆఫ్రాన్ పనులతో పాటు ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు అవసరమైన హైలెవల్ కెనాల్ పనుల నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెం, సిద్ధీపురం గ్రామాలలో జగనన్న హౌసింగ్ కాలనీలకు సంబంధించి భూసేకరణ చేసిన వారిన నిధులను మంజూరు చేయించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న నిధులతో పాటు ప్రజలు తమ దృష్టికి తెచ్చిన అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్ల అదనంగా మంజూరు చేయించాలని కోరారు. ప్రతి సచివాలయానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరవుతున్న రూ.20లక్షల నిధులను రూ.40లక్షలకు పెంచి అందచేయాలని, దానిద్వారా అభివృద్ధి పనులను పూర్తి చేయవచ్చన్నారు.



అన్నదాన కార్యక్రమం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : మండలంలోని దామరమడుగు పంచాయతీ లోగలదిగువపల్లిలో అయ్యప్పస్వాములకు పడుగుపాడు పిఎసిఎస్ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం పెన్నా స్విమ్మర్స్ ఆధ్వర్యంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా చేపట్టారు. కార్యక్రమంలో సంఘమిత్ర కరెస్పాండంట్ కోడూరు రవీందర్ రెడ్డి, ఎస్‌ఐ బాల కోటయ్య, ఉక్కా శ్రీనివాసులు, పులి సుధాకర్, శంకర్, చంద్రయ్య, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల టిడిపి నేతల సంబరాలు



ప్రజాశక్తి-కొండాపురం : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సాయిపేటలో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. టిడిపి సీనియర్ నాయకుడు మాజీ ఎఎంసి వైస్‌చైర్మన్ గంట లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో ఆయన నివాసం నుండి సాయిపేట నాలుగు కూడళ్ల సెంటర్ వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి 75సంవత్సరాలు వయసున్న నారా చంద్రబాబు నాయుడును తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టి వైసిపి శ్రేణులు జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందారని తెలిపారు. అయితే ఈ ఆనందం ఎంతాకాలం ఉండకుండా తమ నాయకుడు కేసుల్లో క్లీన్‌స్వీప్‌తో బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. 1983 నుండి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు టిడిపి హయాంలోనే జరిగినవన్నీ దమ్ముంటే ప్రతిపక్ష వాళ్లు ఈ పని చేశామని చూపిమని ఆయన ప్రశ్నించారు. ప్రజలందరూ టిడిపికి ఓట్లు వేసి వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొన్ని ప్రభాకర్, గంట చిన్న, వెంకటేశ్వర్లు, ఉదయగిరి చిన్న మాల కొండయ్య, వేముల బ్రహ్మయ్య, బాసం సింహాద్రి, కారుమంచి రవి, మాజీ ఎంపిటిసి విప్పర్ల లక్ష్మీనరసింహులు, వింజమూరు మహేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మాజీ సిఎం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్ర బాబుపై ముఖ్య మంత్రి జగన్‌రెడ్డి పెట్టిన అక్రమ కేసులపై న్యాయం గెలిచిందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ పి చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, న్యాయం గెలిచిందని న్యాయానికి నిదర్శనం సిఐడి అధికారులు స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఒక్కపైసా అవినీతిని కూడా నిరూపించలేకపోడమే అని అన్నారు. ఏవిధంగా అయినా సరే అక్రమంగా అరెస్టు చేసి ప్రజల్లో తిరగనికొండ చేయాలని కుట్రలు పన్నారాన్నారు. 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలో పడిన 160స్థానాల్లో టిడిపి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : స్కిల్ స్కాం కేసులో చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో ఉదయగిరిలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో మండల అధ్యక్షులు చింతనబోయిన బయన్న ఆధ్వర్యంలో మండల కమిటీ సభ్యులతో బాణసంచాలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, ఓబుల్ రెడ్డి, నరసింహులు, యువ నాయకులు సంధాని, పులి సంధాని, మాబాషా, కార్యకర్తలున్నారు.

ప్రజాశక్తి-కావలి : మాజీ ముఖ్య మంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడం రాష్ట్రానికి ఒక శుభ పరిణామమని మాజీ ఎజిపి, ప్రముఖ న్యాయవాది, టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుధీర్ఘ మైన విచారణ చేసి, వందలాది మందిని విచారించిన తర్వాత కూడా ఈ కేసులో ప్రైమోఫెసీ కేసు రుజువు కాలేదన్నారు. జగన్ ప్రభుత్వం అభివృద్ధిని మరచి, అరరాచకాలు చేస్తుందన్నారు. ఈ పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న 2024 ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించి, మళ్లీ నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేస్తూ, టిడిపిని అత్యంత మెజారిటీతో గెలిపిస్తారని అయన ఆకాంక్షించారు.

చంద్రబాబుకు బెయిల్ శుభపరిణామం



ప్రజాశక్తి-కావలి : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కార్తీక సోమవారం రోజు రెగ్యులర్ బెయిల్ మంజూరు కావటం శుభ పరిణామం అని ప్రముఖ పారిశ్రామిక వేత్త కావ్య కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత, టిడిపి నేత దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. త్వరలో అన్ని అడ్డంకులు తొలగిపోయి బాబు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవకు పునరంకితం కావా లని ఆకాంక్షించారు. 2024లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కావలి టిడిపి నాయకులు డి.వి.కృష్ణారెడ్డి ప్రకటనలో ఆకాంక్షించారు.


టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: నగరంలోని వెంకటేశ్వరపురం వద్దనున్న టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతులు కరువయ్యాయని జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని 54 వ డివిజన్ వెంకటేశ్వరపురం వద్దనున్న టిడ్కో గృహాల వద్ద జనం కోసం జనసేన, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబులు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి డ్రైయిన్లలోనే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. నీరు రోడ్లపై పారడంతో దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. పలు వీధుల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. చీకటి పడితే లైట్లు లేకపోవటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీస సౌకర్యాలైన సైడ్ డ్రెయిన్ లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేని పక్షంలో జనసేన – తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వంలో ఈ ప్రాంతం నుంచే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. తొలత ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో జనసేన – టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 54వ డివిజన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టె వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ అలియా, డివిజన్ ఇన్‌ఛార్జి సుల్తాన్ బాషా, నాయకులు కుకా ప్రభాకర్, ప్రవీణ్, సాయి, మణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన నాయకులు

కల్వర్ట్ అసంపూర్తిపై గ్రామస్తులు ఆగ్రహం
-ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
వెంచర్ నిర్మాణం కోసం తవ్వి అసంపూర్తిగా వదిలేసిన కల్వర్ట్ నిర్మాణంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలం చింతోపు-పేడూరు లింకురోడ్డు ప్రాంతంలో పేడూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఓ వెంచర్ వేస్తున్నారు. ఈ వెంచర్‌కు వచ్చే ప్రధాన మార్గాన్ని వెడల్పు చేసే ఉద్దేశంతో ఇరిగేషన్ కాలువపై ఉన్న కల్వర్టును కూల్చివేసి దాని స్థానంలో కొత్త కల్వర్ట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ నిర్మాణాన్ని 6 నెలలుగా అసంపూర్తిగా వదిలేశారు. దాంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అసంపూర్తిగా ఉన్న ఈ కల్వర్ట్‌లో రెండు రోజుల క్రితం ఓ ట్రాక్టర్, ఓ గేదె పడి ప్రమాదానికి గురయ్యాయి. అటు వెంచర్ యాజమాన్యం గానీ, ఇటు నీటి పారుదల శాఖ అధికారుల్లో గానీ ఎటువంటి చలనం కనిపించక పోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

కులాల వారీగా వివరాలు సేకరణ..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
ప్రతి ఇంటికీ వెళ్లి కులాల వారీగా వివరాలు సేకరించాలని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సహాయకులు రాజ్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణన ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ ప్రత్యూష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏడిఎ రాజ్ కుమార్, తహశీల్దార్ లావణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాల యాల్లోని సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన ప్రక్రియ జరుగుతుందన్నారు. కుల గణనకు సంబంధించిమండల స్థాయిలో సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని చెప్పారు.వివరాల సేకరణ నుంచి నమోదు వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ పూర్తయినట్టు తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో మండలాల వారీగా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ అందిస్తారని ఏడిఎ పేర్కొన్నారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమానికి నరుకూరు, ఇస్కపాలెం, చింతోపు, కోడూరు బిట్-1, 2 సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.


మాట్లాడుతున్న రాజ్ కుమార్

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విడవలూరు: మండలంలోని విడవలూరులో 56వ గ్రంథాలయ వారోత్సవాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ముగింపు వేడుకలను ఆదివారం నిర్వహించారు. వారోత్సవాలలో నిర్వహించిన పలుపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ సురేంద్ర, అక్షర స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉన్నత పాఠశాల లైబ్రేరియన్ శ్రీవాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు డిజిటల్ గ్రంథాలయం గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సంగంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహశీల్దార్ నాగరాజు పాల్గొని వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మొబైల్ వాడకం తగ్గించి పుస్తక పఠనం చేసినందు వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : గ్రంథాలయం విశిష్టతను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జలదంకి గ్రంథాలయం అధికారిని ఎం.విజయలక్ష్మి పేర్కొన్నారు. గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవం ముగింపు సభ జరిగింది. విద్యార్థులకు బహుమతులను ఎస్ఐపి ఆదిలక్ష్మి చేతుల మీదగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం కొండారెడ్డి, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఇమ్మానియన్ ఉపాధ్యాయులు వి మాధవి, కృష్ణవేణి, వరలక్ష్మి, శాంతి ప్రియ, శ్రీకాంత్, పాఠశాల విద్యార్థులు, లోక్అదాలత్ సభ్యులు మాలకొండా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-సంగం: వైపు వస్తున్న ఆర్‌టిసి బస్సును ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటన సోమవారం మండలంలోని గాంధీ జన సంఘం మలుపు వద్ద చోటుచేసుకుంది. అదే ప్రమాదంలో లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొనగా ఆ కారు బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలవక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వాహనాలు మాత్రం పాక్షికంగా దెబ్బతిన్నాయి. పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదంపై వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అల్లూరు : మండలం పరిధిలోని ఇసుకపల్లి-1 సచివాలయంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన అనంతరం ఎంపి దర్శకుంట శశిరేఖ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్ శ్రీదేవి, సర్పంచి పి రంజిత్ కుమార్, బీద రమేష్, కొండూరు సీనయ్య, తంబీ వాసు, ఇఓపిఆర్‌డి పెంచలవీరేంద్ర, పంచాయతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తపాలా శాఖ భారీ జరిమానా

ప్రజాశక్తి-నెల్లూరు: సేవల్లో లోపానికి గానూ నష్టపోయిన బాధితురాలికి రూ.2.13 లక్షల జరిమానా చెల్లించాలని తపాలా శాఖను ఉమ్మడి నెల్లూరు జిల్లా వినియగదారుల కోర్టు న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ తీర్పుచెప్పారు. విరాల మేరకు కావలికి చెందిన అనుమకొండ వెంకట రత్నమ్మ ఏడాదికి 7.7 శాతం వడ్డీతో కూడిన 5 ఏళ్ల ఫిక్సెడ్ డిపాజిట్ ఖాతా తెరవడానికి 2020 మార్చి 20న పోస్టల్ ఏజెంట్ కు రూ.30 లక్షలకు చెక్కు, డాక్యుమెంట్లను అందజేసింది. ఈ సమాధానంతో సంతృప్తి చెందని బాధితురాలు తనకు 7.7 శాతం వడ్డీ తోనే ఖాతా ఉండాలని అభ్యర్థించించినా అధికారులు పట్టించుకోలేదని, ఇక చేసేదేమీ లేక సదరు బాధితురాలు వినియోగదారుల కోర్టును ఆశ్రయించింది. విచారించిన న్యాయమూర్తి జింకా రెడ్డి శేఖర్ బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చారు.

అట్టహాసంగా ఎఎంసి కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-నెల్లూరుఅర్బన్
నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. నెల్లూరులోని జిపిఆర్ గ్రాండ్ లో సోమవారం నూతన ఎఎంసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. నెల్లూరు అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, స్రవంతి జయవర్ధన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత నూతన ఎఎంసీ చైర్మన్ గా పేర్నేటి కోటేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఒట్టూరు సుధాకర్ యాదవ్ లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకమండలి డైరెక్టర్ల చేత మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారాన్ని చేయించారు.


ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న నాయకులు

అన్ని విధాలుగా ఆదుకుంటాం:మంత్రి కాకాణి
నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీకి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. అదనపు నిధులు మంజూరు చేసి మార్కెటింగ్ కమిటీని అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మంచి వ్యక్తులతో నిండిన నూతన ఏఎంసీ పాలకమండలిని ఏర్పాటుచేసిన ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డిని అభినందిస్తున్నానని మంత్రి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా నూతనంగా ఏర్పడిన ఏఎంసీ కమిటీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలిపారు.ప్రత్యేక నిధులు మంజూరుచేసి ఆదుకోవాలని తెలిపారు.నూతనంగా ఏర్పడిన నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీకి అవసరమైన ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని కోరారు. కొత్తగా ఏర్పడిన కమిటీకి పూర్తి సహాయ సహకారాలు అందించాలని మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా మంత్రి పూర్తి సహాయ సహకారాలు తీసుకుంటూ నెల్లూరు అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ పరిధిలోని రైతులకు మంచి సేవలను అందించాలని నూతన పాలక మండలికి ఎంపీ ఆదాల సూచించారు. మంచి వ్యక్తులతో ఏర్పడిన నూతన పాలక మండలికి తన సంపూర్ణ సాహసకారాలు ఉంటాయని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి భరోసా ఇచ్చారు. నూతన కమిటీకి మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నామన్నారు. అనంతరం చైర్మన్ పేర్నాటి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య అధ్యక్షత వహించారు. సభ వేదిక పైన గూడూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కోడూరు కల్పలత, సీనియర్ నాయకులు వైవి రామిరెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వేలూరు శివ సునీల్ రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు మొయిళ్ళా గౌరీ, జెడ్‌పిటిసి సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా సీనియర్ నాయకులు కోడూరు మీరా రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు సయ్యద్ మొబీనా, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు పాలకీర్తి రవికుమార్, కార్యకర్తలు హాజరయ్యారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాశక్తి నెల్లూరు సిటీ
వర్షాభావ పరిస్థితుల వల్ల నీటిని పొదుపుగా వాడుకొని రబీ సీజన్లో పంటలను సాగు చేసుకుని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి పేర్కొన్నారు. నెల్లూరు రైతు శిక్షణ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు జిల్లా వనరుల కేంద్ర ప్రాజెక్టు డైరెక్టర్ దొరసానమ్మ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నిత దశలో నీటి వథా అరికట్టాలని, తక్కువ నీటితో అధిక దిగుబడును సాధించే వంగడాలను ఎంచుకోవాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త శ్రీలక్ష్మీ మాట్లాడుతూ రవిలో సాగు చేయు రైతులు స్వల్పకాలిక రకాలైన ఆర్ఎన్ఆర్-15048, ఎన్ ఎల్ ఆర్-3354,34449, కే.ఎన్ .ఎం.-773, 1638 రకాల వంగడాలు 120 రోజుల కాల పరిమితిలో పంటచేతికి వస్తుందన్నారు. డిసెంబర్ 20 పైన ఎలాంటి రకాలైన నార్లు పోయరాదనీ అదేవిధంగా బిపిటి-5204 రకాలను 125-135 రోజులు ఉన్న మధ్యకాలిక రకాలను మరియు 140-145 రోజుల దీర్ఘకాలిక రకాలను సాగు చేయరాదన్నారు. వరిసాగు పద్ధతుల గురించి , నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యాల గురించి ప్రధాన శాస్త్రవేత్త వినీత తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శివ నారాయణ, జిల్లా మార్కెటింగ్ మేనేజర్ పవన్ కుమార్, డి ఆర్ సి మారుతీ దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారిసత్యవాణి

విద్యార్థుల జీవితాలతో వైసిపి చెలగాటం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ
విద్య దీవెన, వసతి దీవెన నిబంధనలను విద్యా సంవత్సరం మధ్యలో మార్చి విద్యార్థుల జీవితాలతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ల రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ లోపు విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ అకౌంట్ తెరిస్తేనే, దీవెన డబ్బులు అని నిబంధనలు ప్రభుత్వం పెట్టిందన్నారు.ఏదొక విధంగా విద్యార్థుల సంఖ్య తగ్గించాలనే ఉద్దేశంతోనే అర్థం, పర్థం లేని నిబంధనలు పెడుతున్నారన్నారు.గత టిడిపి ప్రభుత్వంలో ఏడాదికి 19 లక్షలు మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇస్తే, ఆ పథకానికే వసతి దీవెన అని పేరు మార్చి 12 లక్షల మందికే వైసిపి ప్రభుత్వం ఇస్తుందన్నారు.ప్రయివేటు కళాశాలలో చదివే పిజీ విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన నిలిపి వేశారన్నారు.గత ప్రభుత్వాలలోఅమలు అవుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి జగనన్న విద్యా ధీవెన అని, ప్రీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పథకానికి జగనన్న వసతిదీవెన అని పేర్లు మార్చి వీటిని కొత్తగా ప్రవేశపెట్టినట్లు జగన్ మోహన్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారన్నారు.


మాట్లాడుతున్న చేజర్ల

కబడ్డీ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి: రాష్ట్ర స్థాయి బాలురు, బాలికల కబడ్డీ పోటీలు 24, 25, 26వ తేదీలలో చిత్తూరు జిల్లా చౌడేపల్లి జిల్లాపరిషత్ హై స్కూల్‌లో జరుగుతున్న సందర్భంగా జిల్లా కబడ్డీ జట్టులోని బాల, బాలికల క్రీడాకారులకు సోమవారం కావలి విశ్వోదయ బాలుర హైస్కూల్‌లో కోచింగ్, క్యాంపు ప్రారంభమైనది. కావలి డిప్యూటీ డి.ఇ.ఒ. రఘురామయ్య, విశ్వోదయ స్కూల్ క్యారస్పాండెంట్ ఎన్. విజయ శంకర్‌రెడ్డిలు ఈ క్యాంపును రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథులతో పాటు స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.డి. చౌదరి, జలదంకి హెడ్ మాస్టర్ కొండారెడ్డి, క్యాంపుకో-ఆర్డినేటర్ శివకుమార్ రెడ్డి, పి.ఇ.టి.లు రాజ్యలక్ష్మి, చిరంజీవి, శ్రీధర్, ప్రవీణ్, విశ్రాంత పి. డి. కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు ఎం.కళ్యాణి, దేవకీ, షరీఫ్, కబడ్డీ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్య కారులను ఎస్‌టి జాబితాలో చేర్చండి

ప్రజాశక్తి-కావలి: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మత్స్య సంపదను కాపాడి, ఆర్థిక వనరులు చేకూర్చుచున్న మత్స్యకారులను వెంటనే ఎస్‌టి జాబితాలో చేర్చాలని మత్స్యకార సంక్షేమ నాయకులు, సామాజిక కార్యకర్త ఐ.సాయి ప్రసాద్ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు. అకస్మాత్తుగా వచ్చే భీకర తుపాన్ ప్రళయాలకు, పెద్దపెద్ద గాలివానలకు ప్రభుత్వం వారు నిర్మించిన పునరావాస కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. మత్యకారులకు రాయితీ ద్వారా డీజిల్, మర పడవలు, ఇంజన్ బోట్లు, మౌలిక సదుపాయాలు కల్పించి మత్యసంపదను పెంచుకొని ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచుకోవాలని కోరారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-బిట్రగుంట: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టు సోమవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసినందున మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, మండలం కన్వీనర్
మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బోగోలు గ్రామంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ టిడిపి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుక కార్తీక సోమవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడం టిడిపి కార్యకర్తలకు ఎంతో ఆనందంగా ఉందని ,ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని గుడిగుంట, గోగులపల్లి, బివడ్డీపాలెం, బి అగ్రహారం, బొమ్మవరం ప్రాథమిక పాఠశాలల్లో ఎంఇఒ బాలకృష్ణారెడ్డి సందర్శించారు. ఆయన సిలబస్, వర్క్‌బుక్స్ దిద్దటం, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలిచ్చారు.


మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

బాబుకు రెగ్యులర్ బెయిల్‌పై హర్షం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ
ఆలస్యమైనా నిజం గెలిచిందనీ, వైసీపీ ప్రభుత్వ మెప్పు కోసం పాకులాడిన అబద్ధపు ఆరోపణల సిఐడి ఓడిందనీ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నాయుడుకు రెగ్యులర్ బెయిల్ మంజూరుతో న్యాయస్థానాలపై నమ్మకం మరింతగా పెరిగిందన్నారు.కుట్రలు, కుతంత్రాలతో న్యాయాన్ని నిర్బంధించలేరని మరోసారి రుజువైందన్నారు .ప్రజాక్షేత్రంలోకి చంద్రబాబు రాక కోసం రాష్ట్రమంతా వేచి చూస్తోందన్నారు.కోట్లాది రూపాయల ప్రజా ధనం, విలువైన న్యాయస్థానాల సమయంను వథా చేయడం తప్ప.... సిఐడి సాధించింది ఏమీ లేదన్నారు.నవంబర్ 29 నుంచి ర్యాలీల్లో, సభల్లో చంద్రబాబు పాల్గొనవచ్చని న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందన్నారు. రాష్ట్ర, దేశ పరిధులతో సంబంధం లేకుండా చంద్రబాబుకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-కందుకూరు: కనిగిరి రోడ్‌లోని "శ్రీ అయ్యప్ప స్వామి" గుడి వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న అన్న ప్రసాద వితరణ భవనానికి కందుకూరు వాస్తవ్యులు వలేటి.తిరుపతి నాయుడు (అడ్వకేట్) ,వలేటి.ఆంజనేయులు (మాజీ సర్పంచ్) వారి కుమారుడైన వలేటి.శ్రీధర్ నాయుడు (అడ్వకేట్), వలేటి.మధు సూదన్ రావు(మారుతి పెర్టిలైజ ర్స్)లు అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కొరకు రూ 100116 విరాళము అందించారు. కార్యక్ర మంలో అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు కెఎస్.వెంకటేశ్వర్లు, ఇస్కాల.వెంకట నరసింహ, నల్లబోతుల.మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా.చెంచురామయ్య, దాసరి .శ్రీనివాసులు, ఉన్నం.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం నాయకులు హర్షం

ప్రజాశక్తి-విడవలూరు : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో మండలంలోని తెలుగు తమ్ముళ్ల హర్షం వ్యక్తం చేశారు. మండలంలో పలుచోట్ల సంబరాలు చేసుకున్నారు. 2024లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు కోరారు.

హార్బర్‌తో మత్స్యకారులకు ఉపాధి

ప్రజాశక్తి-బిట్రగుంట: జువ్వలదిన్నె గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిషింగ్ హార్బర్ వల్ల మత్స్యకార కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో మేకనైజర్ బోటును సోమవారం ఎంఎల్ఎ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాండిచ్చేరి, తమిళనాడు ప్రాంతాలను నుండి మెకానిజర్ బోట్లు మన తీర ప్రాంతానికి వచ్చి మన జాలర్లను ఇబ్బందులకు గురిచేసి వలలను తెంపి వేయడం జరిగిందని, ఈ విషయమై సిఎం దృష్టికి తీసుకొని వెళ్లగా మత్స్యకారుల సంరక్షణ కోసం మేక నైజర్ బోటును ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, ఎస్ఐ శేఖర్ బాబు, ఎఎంసి చైర్మన్, సబ్ మెరైన్ పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, కాపులు, పెద్ద కాపులు, గ్రామస్తులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కులగణన సర్వేపై సోమవారం ఎంపిడిఒ నాగమణి సచివాలయ సిబ్బందికి శిక్షణ నిచ్చారు. ఈ శిక్షణకు సచివాలయ సిబ్బందిని నాలుగు విభాగాలుగా ఉదయం, మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ మల్లికార్జున, ఎంఇఒ షావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విడవలూరు : కులగణన సర్వేపై గ్రామ సచివాలయ సిబ్బందికి వలంటీర్లకు అవగాహన సదస్సును మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఇఒ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీదేవి సోమవారం కులగనన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పెంచలయ్య, తహశీల్దార్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : కులగణన సర్వే ఎంపిడిఒ మధుసూదన్ రావు అధ్యక్షతన సోమవారం 6 సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ నిచ్చారు. ప్రత్యేక అధికారులుగా ఎంఇఒలు బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎఎస్ఒ మోహన్ శిక్షణను ఇచ్చారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు పైయ్యల సంపూర్ణమ్మ మాట్లాడారు.

ప్రజాశక్తి - కావలి రూరల్ : కావలి మండల పరిధిలోని 16 పంచాయతీలకు గానూ సోమవారం 6 పంచాయతీల పరిధిలోని సచివాలయ సెక్రెటరీ, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాల సిబ్బందికి కులగణన వ్యక్తిగత సమాచార సేకరణపై ఎంపిడిఒ కార్యాలయంలో ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎ వి మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దారు మాధవరెడ్డి, ఎపిఎం కాంతారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలపై మూడు అర్జీలు

ప్రజాశక్తి-మర్రిపాడు
స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఆనంద్ రావుకు భూ సమస్యలపై 3 అర్జీలు ఇచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇన్‌ఛార్జి తహశీల్దారు హామీనిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రామ్మోహన్, ఎంఇఒ-2 ధనలక్ష్మి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి కొండారెడ్డి, ఎపిఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' పై సమీక్ష

ప్రజాశక్తి - కావలి రూరల్
డిసెంబర్ 15వ తేదీ నుండి జరిగే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల కోఆర్డినేటర్ పి చిరంజీవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వ్యాయామం ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ ఎవి మోహన్, ఎంఇఒలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వ్యాయామం ఉపాధ్యాయులు, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపి ఆదాలను సన్మానిస్తున్న దృశ్యం

ఎంపి ఆదాలకు వినతి

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్
ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు సోమవారం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డినీ కలిశారు. ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అవసరమైన భవనాన్ని నిర్మించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని వినతి పత్రం అందించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుల విజ్ఞప్తికి స్పందించిన కలెక్టర్‌తో చర్చించి భవన నిర్మాణంకు అవసరమైన చర్యలను తీసుకుంటామని తెలిపారు. తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి కి అసోసియేషన్ తరపున ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతు న్నామని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఐ.లక్ష్మీ నారాయణ, పి వెంకయ్య, మురళీ మోహన్, నలిని మోహన్, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో ఆదాల

అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్
నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో పలు అభివద్ధి నిర్మాణ పనులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయడం జరిగింది. 20వ డివిజన్లోని వివిధ ప్రాంతాలలో రూ. 62లక్షలతో స్టీల్ ఫ్యాక్టరీ సెంటర్, స్నేహ నగర్ శివాలయం సమీపంలో సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్స్ నిర్మాణ పనులకు సంబం ధించి ఏర్పాటుచేసిన శంకుస్థాపన శిలాఫల కాన్ని ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు పాతపాటి పుల్లారెడ్డి, శ్రీఇరుకళల పరమేశ్వరి దేవస్థానం చైర్మన్, డివిజన్ ఇన్‌ఛార్జి రావు శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌ఛార్జి తాళ్లూరి సురేష్ బాబు, డివిజన్ సీనియర్ నాయకులు, దువ్వూరు భాస్కర్ రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు.


పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్: పుస్తకం హస్తం భూషణం లాంటిదని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కుమార్ రాజా పేర్కొన్నారు. రత్నమ్మ చారిటబుల్ ట్రస్టు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ రాచపాలెం రఘు 100 పుస్తకాలు బహూకరించారు. ఈసందర్భంగా డాక్టర్ రాచపాలెం రఘు మాట్లాడుతూ చరిత్రలో గొప్ప గొప్ప వాళ్ళ పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని సంపాదించి పేరు ప్రఖ్యాతలు పొందారని తెలిపారు. రచయిత కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ చరిత్ర చెరిగి పోకుండా ఉండాలంటే పుస్తకాలను భద్రపరచాలి. పుస్తకం నీముంగిట్లో ఉంటే నీ విలువ మరింత పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డూప్యూటీ లైబ్రేరియన్ సి.హెచ్.ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్నడి.చంద్రశేఖర్ వర్మ

కార్యస్థల ఆరోగ్యం, భద్రత కీలకం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
సులభతర కార్యకలా పాలకు కార్యస్థల ఆరోగ్యం, భద్రత కీలకమని రాష్ట్ర కర్మాగారాల సంచాలకులు డి.చంద్రశేఖర్ వర్మ పేర్కొన్నారు. మండలంలోని వరకవిపూడి పంచాయతీ ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌లో సోమవారం ఫ్యాక్టరీస్ యాక్ట్ అండ్ రూల్స్ "ఓహెచ్ఎస్ ఎక్సలెన్స్ కోసం ఒక మార్గం అ నే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా చంద్రశేఖర్ వర్మ హాజం య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీస్ యాక్ట్ అండ్ రూల్స్ ఓహెచ్ఎస్ ఎక్సలెన్స్ కోసం ఒక మార్గం అన్నారు. కార్యస్థలంలో ఆరో గ్యం, భద్రత ప్రధానమని, సులభతర కార్యకలా పాలకు అవి ఎంతో కీలకమని తెలిపారు. ఆక్యు పేషనల్ హెల్త్, సేఫ్టీ (ఓహెచ్ఎస్) చాలా ముఖ్యమని చెప్పా రు. పనిలో ఉన్న వ్యక్తుల భద్రత, ఆరోగ్యం సంక్షేమం కోసం ఈ నిబంధనలు పాటిం చాలని సూచించారు. అంతేకా కుండా ఓహెచ్ఎస్ అనేది వత్తిపరమైన వైద్యం, పరిశుభ్రతలకు సంబంధించిందని చె ప్పారు. వత్తిపరమైన వాతావరణం వల్ల ప్రభావి తమయ్యే సాధారణ ప్రజలందరినీ కూడా రక్షి స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఐఎల్ ఓ అండ్ ఎం హెడ్ సునీల్ కుమార్ గుప్తా, ఏపి జెన్కో, ఆదాని కష్ణపట్నం పోర్ట్, 60కి పైగా పరిశ్రమల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.